సాక్షి
ప్రకాశం
శుక్రవారం ∣ 10 ∣ ఫిబ్రవరి ∣ 2023



అధికారుల్లో మార్పు రావాలి
గిరిజనుల విషయంలో అధికారుల్లో మార్పు రావాలని, లేకుంటే సహించేది లేదని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు హెచ్చరించారు. - 8లో..



వాటర్‌గ్రిడ్‌తో సురక్షిత జలాలు
పశ్చిమ ప్రకాశంలో రూ.400 కోట్లతో సురక్షిత జలాల ప్రాజెక్టు మంజూరు కావడంతో 442 గ్రామాలకు మేలు జరుగుతుందని కనిగిరి ఎమ్మెల్యే బుర్రా తెలిపారు. - 8లో..

వాతావరణం
గరిష్టం/కనిష్టం
32 /20
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. గాలిలో తేమశాతం ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సోషల్ వెల్ఫేర్ ఇన్‌చార్జి డీడీగా దానయ్య

ఒంగోలు: సాంఘిక సంక్షేమశాఖ ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్‌గా కొండపి ఏఎస్‌డబ్ల్యూవో యు.దానయ్యను నియమిస్తూ కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం డిప్యూటీ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న లక్ష్మానాయక్ మెడికల్ లీవ్‌పై 15 రోజులపాటు సెలవు పెట్టడంతో ఆ బాధ్యతలను తాత్కాలికంగా దానయ్యకు అప్పగించారు.

వెట్టిచాకిరిని నిర్మూలించాలి

ఒంగోలు అర్బన్: రాష్ట్రాన్ని వెట్టిచాకిరి విధాన రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ఫిబ్రవరి 9వ తేదీన వెట్టిచాకిరి నిర్మూలన దినోత్సవంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు వెట్టిచాకిరి నిర్మూలనపై ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమం నిర్వహించేందుకు రూపొందించిన గోడ పత్రికను గురువారం ప్రకాశం భవనంలో పోలీసు సీఐడీ విభాగం ఆధ్వర్యంలో కలెక్టర్ దినేష్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వెట్టిచాకిరి విధానాన్ని సమూలంగా నిర్మూలించాలన్నారు. ప్రజలు అవగాహనతో ఉండి తమ వంతు బాధ్యత చూపాలన్నారు. కార్మిక శాఖతో పాటు సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో సహాయ కార్మిక శాఖ కమిషనర్లు కనకదుర్గాభవాని, కోటేశ్వరరావు, చైల్డ్ లేబర్ పీడీ అనితావాణి, సహాయ కార్మిక అధికారులు వెంకటేశ్వర్లు, ఎలిజిబెత్, న్యాయసేవాధికారి సంస్థ, పోలీసు శాఖ అధికారులు పాల్గొన్నారు.

38 మందికి సబ్జెక్టు టీచర్లుగా ఉత్తర్వులు

ఒంగోలు: జిల్లాలోని 38 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లను స్కూల్ అసిస్టెంట్లుగా వర్క్ అడ్జెస్టుమెంట్ ప్రాతిపదికపై నియమించినట్లు డీఈవో బి.విజయభాస్కర్ తెలిపారు. బీఈడీ కలిగి ఉండి సబ్జెక్టు టీచర్లుగా పనిచేసేందుకు ఆసక్తి చూపే వారికి అవకాశం కల్పిస్తూ డీఈవో ప్రకాశం వెబ్‌సైట్లో జాబితాను ఉంచారు. వారిలో గణితం-27, సోషల్ స్టడీస్-61, ఆంగ్లం-18, బయోలాజికల్ సైన్సెస్-25 మందితో జాబితాను ఉంచారు. వారికి గురువారం స్థానిక డీఆర్‌ఆర్ఎం ఉన్నత పాఠశాల ఆవరణలో కౌన్సెలింగ్ నిర్వహించగా, గణితం-9 మంది, బయోలాజికల్ సైన్సెస్-5, ఆంగ్లం-14, సోషల్ స్టడీస్-10 మంది అంగీకారం తెలిపారు. గణితం-18, బయోలాజికల్ సైన్స్-20, సోషల్ స్టడీస్-51, ఆంగ్లం-4 పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. దీనిపై డీఈవో బి.విజయభాస్కర్ మాట్లాడుతూ మిగిలిన పోస్టులకు తదుపరి సీనియార్టీ జాబితాను ప్రకటించి వారి ద్వారా భర్తీ చేసేందుకు చర్యలు చేపడతామని అన్నారు.

అంతరంగాన్ని ఆవిష్కరించిన అంగలకుర్తి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గజల్ శ్రీనివాస్

ఒంగోలు టౌన్: సమాజంలో పీడనకు, దోపిడీకి గురైన అట్టడుగు మనుషుల జీవితాలను ఆవిష్కరించిన డాక్టర్ అంగలకుర్తి విద్యాసాగర్ రచనలు సమకాలీన సమాజంలో నిత్యం ఆలోచనలు రేకెత్తిస్తున్నాయని గజల్ మాస్ట్రో గజల్ శ్రీనివాస్ అన్నారు. రంగభూమి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ కళాపరిషత్‌లో గురువారం నిర్వహించిన డాక్టర్ విద్యాసాగర్ సాహితీ సమాలోచన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యాసాగర్ రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. విద్యాసాగర్ రచించిన పాటైనా, కవిత్వమైనా, కథైనా అట్టడుగు మనుషుల చుట్టే పరిభ్రమిస్తుందని గజల్ శ్రీనివాస్ కొనియాడారు. ఒక సామాజిక బాధ్యతగా జనం పక్షాన రచనలు చేస్తున్న ఆయన.. మరిన్ని రచనలు చేయాలని ఆకాంక్షించారు. ఐఏఎస్ అధికారిగా ప్రజలకు ఉత్తమ సేవలందించిన విద్యాసాగర్.. మేలిమి రచనలతో ఉత్తమ సాహిత్య సేవ చేస్తున్నారని సభకు అధ్యక్షత వహించిన నాటక రచయిత డాక్టర్ పాడిబండ్ల ఆనందరావు ప్రశంసించారు. నగరానికి వచ్చిన నాగళ్లు, మనిషి ఒకడే విడిగా మనలేడు, అసలు సంతకం తదితర రచనలను ప్రకాశం జిల్లా రచయితల సంఘ జిల్లా అధ్యక్షుడు పొన్నూరి శ్రీనివాసులు సమీక్షించారు. ప్రముఖ కవులు కత్తి కళ్యాణ్, డా.క్షామరీడు ప్రసంగించారు. అనంతరం కవి విద్యాసాగర్, గజల్ శ్రీనివాస్ తదితరులను సంస్థ అధ్యక్షులు ఏ ప్రసాద్, కోశాధికారి ధేనువకొండ సుబ్బారావు సత్కరించారు. గజల్ శ్రీనివాస్ పాడిన గజల్స్ ప్రేక్షకులను అలరించాయి. ఈ సందర్భంగా జరిగిన సంగీత విభావరిలో గాయకులు శ్యాంప్రసాద్, బ్రహ్మయ్య, రవివర్మ, శరత్ ఆలపించిన గేయాలు ఆకట్టుకున్నాయి. ఇమ్మానియేల్ వేణునాథం హైలెట్‌గా నిలిచింది.

ఒంగోలు నగర వ్యూ



ఒంగోలు రెండుగా..

పెరుగుతున్న నగర జనాభా..అందుకు తగ్గట్టుగా ప్రజలకు సేవలందించడం..రెవెన్యూ శాఖ పరిపాలనా సౌలభ్యం కోసం ఒంగోలు మండలాన్ని రెండుగా విభజించారు. కొత్తగా రూరల్ మండలం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో జిల్లాలో మండలాల సంఖ్య 39కి చేరుకోనుంది. నగర స్వరూపం మారనుంది. 11 రెవెన్యూ గ్రామాలతో రూరల్ మండలం ఏర్పాటు కానుండటంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- ఒంగోలు అర్బన్, రూరల్ మండలాలుగా విభజన
- జిల్లాలో 39కి చేరిన మండలాల సంఖ్య
- ఆమోదించిన రాష్ట్ర కేబినెట్
- ప్రభుత్వ సేవలు సత్వరం అందించాలన్న లక్ష్యంతోనే విభజన
- మారనున్న ఒంగోలు స్వరూపం
- అర్బన్ మండలంలో జనాభా : 2,27,097 మంది
- ఒంగోలు రూరల్ మండలంలో జనాభా : 33,432 మంది

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ఒంగోలు నగరంతో పాటు ఒంగోలు మండలంలోని అన్ని గ్రామాలకు కలిపి ఒకే తహసీల్దార్ కార్యాలయం ఉంది. ఈ కార్యాలయం ద్వారానే రెవెన్యూ పరమైన సేవలు అందిస్తూ వచ్చారు. నగర జనాభా పెరుగుతుండటంతో అటు అధికారులు, ఇటు ప్రజలు ఇబ్బందిపడుతూ వచ్చారు. పరిపాలనా ఫలాలు సకాలంలో అందించాలన్న ఉద్దేశంతో ఒంగోలు మండలాన్ని రెండుగా విభజించాలని అధికారులు తలచారు. అందుకు తగ్గట్టుగా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వాటిని ప్రభుత్వానికి పంపారు. వీటిని పరిగణలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రూరల్ మండలం ఏర్పాటుకు పచ్చ జెండా ఊపింది. ఆ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీ నిర్వహించిన మంత్రివర్గ సమావేశం ఆమోదించింది. ప్రస్తుతం ఉన్న ఒంగోలు తహసీల్దార్ కార్యాలయం స్థానంలో ఒంగోలు అర్బన్, ఒంగోలు రూరల్ తహసీల్దార్ కార్యాలయాలు ఏర్పాటు కానున్నాయి. దీంతో ప్రతి తహసీల్దార్ కార్యాలయానికి ఒక్కో తహసీల్దార్‌ను నియమించడంతో పాటు మిగతా సిబ్బందిని కూడా విభజించి పరిపాలనను అందరికీ చేరువ చేయనున్నారు. వాస్తవానికి 2011 జనాభా లెక్కల ప్రకారం రెండు మండలాలుగా విభజించారు. అప్పటి లెక్కల ప్రకారం ఒంగోలు మున్సిపాలిటీ, ఒంగోలు మండలం కలిపి 2,61,529 మంది మాత్రమే ఉండేవారు. కానీ, రోజురోజుకు పెరుగుతున్న జనాభా, కేంద్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలో 3 లక్షల మందికిపైగా జనాభా ఉన్నట్లు లెక్కలు తేల్చారు. ఇక, ఒంగోలు మండలంలో మరో 45 వేల వరకు ఉండవచ్చని అంచనా. వెరసి రమారమి మొత్తం కలుపుకుంటే 3.45 లక్షల మంది వరకు జనాభా ఉండవచ్చు.

మొత్తం కలిపి 19 రెవెన్యూ గ్రామాలు...

ప్రస్తుతం ఒంగోలు తహసీల్దార్ కార్యాలయం పరిధిలో 19 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. వాటి పరిధిలో ఒంగోలు నగరంతో పాటు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రస్తుతానికి రెవెన్యూ గ్రామాల వరకు చూస్తే.. దేవరంపాడు రెండు రెవెన్యూ గ్రామాలుగా ఉంది. ఆ తర్వాత ఉలిచి, చేజర్ల, కరవది, త్రోవగుంట, సర్వేరెడ్డిపాలెం, యరజర్ల, మంగళాద్రిపాలెం, ఒంగోలు, అన్నవరప్పాడు, కొప్పోలు, గుడిమెల్లపాడు, చెరువుకొమ్ముపాలెం, నరసాపురం, పెళ్లూరు, మామిడిపాలెం, మల్లేశ్వరపురం, ముక్తినూతలపాడు, వెంగముక్కలపాలెం ఉన్నాయి.

ప్రస్తుతం ఒంగోలు మండల స్వరూపం...

రెవెన్యూ గ్రామాలు - 19
గ్రామ పంచాయతీలు - 14
కార్పొరేషన్ వార్డులు - 46
మొత్తం విస్తీర్ణం 49,875 ఎకరాలు
మొత్తం గృహాలు 69,102
2011 జనాభా లెక్కల ప్రకారం 2,61,529 మంది

విభజించిన తర్వాత ఇలా...

రెవెన్యూ గ్రామాలు - 11
గ్రామ పంచాయతీలు - లేవు
కార్పొరేషన్‌లోని వార్డులు - 1 నుంచి 38 వరకు, 43 నుంచి 50 వరకు అర్బన్‌లోనూ, మిగిలిన 39, 40, 41, 42 డివిజన్లు సంతనూతలపాడు మండల పరిధిలోనూ ఉంటాయి.
అర్బన్ విస్తీర్ణం - 21,733 ఎకరాలు
2011 లెక్కల ప్రకారం జనాభా - 2,27,097
గృహాల సంఖ్య - 57,771
రెవెన్యూ గ్రామాలు : ముక్తినూతలపాడు, గుడిమెళ్లపాడు, కొప్పోలు, చెరువుకొమ్ముపాలెం, పెళ్లూరు, అన్నవరప్పాడు, మామిడిపాలెం, వెంగముక్కలపాలెం, ఒంగోలు, మల్లేశ్వరపురం, నరసాపురం.

కొత్తగా ఏర్పాటు కానున్న రూరల్ మండలం ఇలా...

రెవెన్యూ గ్రామాలు - 8
గ్రామ పంచాయతీలు - 14
కార్పొరేషన్ పరిధిలోని వార్డులు - లేవు
మొత్తం విస్తీర్ణం -28,142 ఎకరాలు
2011 లెక్కల ప్రకారం జనాభా - 33,432
మొత్తం గృహాల సంఖ్య - 11,331
రెవెన్యూ గ్రామాలు : దేవరంపాడు, ఉలిచి, చేజర్ల, కరవది, సర్వేరెడ్డిపాలెం, యరజర్ల, మంగళాద్రిపురం, వలేటివారిపాలెం, మండువారిపాలెం (త్రోవగుంట).
గ్రామ పంచాయతీలు : చింతాయగారిపాలెం, దేవరంపాడు, బొడ్డువానిపాలెం, పాతపాడు, గుండాయపాలెం, దేవరంపాడు హరిజనవాడ, ఉలిచి, చేజర్ల, కరవది, దశరాజుపల్లె, వలేటివారిపాలెం, మండువవారిపాలెం, సర్వేరెడ్డిపాలెం, యరజర్ల.

ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

- పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి
- ఎన్నికల నిర్వహణ సామగ్రిని ఇండెంట్ మేరకు కొనుగోలు చేయాలి
- కలెక్టర్ దినేష్‌కుమార్



ఎమ్మెల్సీ ఎన్నికలపై వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ జిల్లా అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా జిల్లా కలెక్టర్లతో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక ప్రకాశం భవనం నుంచి కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం ఎన్నికల నిర్వహణపై జిల్లా అధికారులతో కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులను పరిశీలించి నివేదిక అందజేయాలన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రికి ఇండెంట్ తీసుకుని వాటిని కొనుగోలు చేయాలన్నారు. ఎన్నికల విధులు కేటాయించేందుకు అవసరమైన సిబ్బంది వివరాలు సేకరించాలన్నారు. బ్యాలెట్ బాక్స్‌లు సిద్ధం చేయాలన్నారు. పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిశీలించాలని, సుమోటో డూప్లికేట్ దరఖాస్తులు, అనర్హులవి తొలగించే విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చినందున తహసీల్దార్లు, ఎస్‌హెచ్‌వో, కానిస్టేబుల్ వీడియోగ్రాఫర్ ఎంసీసీ బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. జనరల్ ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులకు వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలన్నారు. ప్రస్తుతం 77 శాతం ఉన్న ఓటరు కార్డు ఆధార్ అనుసంధానంలో మరింత పురోగతి కనిపించాలన్నారు. సమావేశంలో మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్, ఒంగోలు ఆర్డీవో విశ్వేశ్వరరావు, కనిగిరి ఆర్డీవో సందీప్‌కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సరళావందనం, గ్లోరియా, శ్రీదేవి, జెడ్పీ సీఈవో జాలిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

పాకల తీరానికి దగ్గరగా సోనా బోట్లు



ఊళ్లపాలెం తీరంలో చేపల వేట సాగిస్తున్న సోనా బోట్లు

- మరోసారి ఆందోళనలో మత్స్యకారులు

సింగరాయకొండ (టంగుటూరు): సముద్ర తీర ప్రాంత చట్టాలను అతిక్రమిస్తూ సింగరాయకొండ మండలంలోని ఊళ్లపాలెం, పాకల సముద్రతీరంలోకి గురువారం కడలూరు సోనా బోట్లు వచ్చి హల్‌హల్ చేశాయి. తమిళనాడు రాష్ట్రం కడలూరుకు చెందిన 8 సోనా బోట్లు తీరానికి దగ్గరగా రావడంతో స్థానిక మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నెల రోజుల క్రితం పాకల, కొత్తపట్నం తీరానికి వచ్చిన సోనా బోట్లను మత్స్యశాఖ, మెరైన్ పోలీసులు, స్థానిక మత్స్యకారులు పక్కా ప్రణాళికతో తరిమికొట్టారు. 15 రోజుల క్రితం కూడా సోనా బోట్లు తీరానికి వచ్చే ప్రయత్నం చేయగా, వాటిని అడ్డుకునేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. ఆ విషయాన్ని స్థానిక మత్స్యకారుల ద్వారా తెలుసుకున్న సోనా బోట్లలోని మత్స్యకారులు.. వెంటనే పలాయనం చిత్తగించారు. దీంతో కడలూరు సోనా బోట్ల బెడద వదిలిపోయిందని మత్స్యకారులు భావించి సముద్రంలో చేపల కోసం వలలు వదిలారు. ఈ నేపథ్యంలో గురువారం తెల్లవారుజాము నుంచి 8 సోనా బోట్లు కరేడు, పాకల, ఊళ్లపాలెం, కొత్తపట్నం ప్రాంతాల్లో తీరానికి సమీపంలో చేపల వేట సాగించడంతో లక్షలాది రూపాయల వలలు ధ్వంసమయ్యాయి. దీంతో స్థానిక మత్స్యకారులు దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి సోనా బోట్లు రాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని మత్స్యకారులు కోరుతున్నారు.

గిరిజనాభివృద్ధే జగనన్న లక్ష్యం



గిరిజనులతో ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్, వేదికపై ఎస్టీ కమిషన్ చైర్మన్ రవిబాబు

- మంత్రి వర్గంలో సైతం గిరిజనులకు స్థానం
- విద్యతోనే అన్ని సమస్యలకు పరిష్కారం
- గిరిపుత్రుల అభివృద్ధికి ఎన్ని నిధులైనా కేటాయించేందుకు సిద్ధం
- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: రాష్ట్రంలో సమగ్ర గిరిజనాభివృద్ధి సాధించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాటుపడుతున్నారని, వారి అభివృద్ధి కోసం ఎన్ని నిధులైనా ఖర్చుపెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. ఏపీ ఎస్టీ కమిషన్ ఆధ్వర్యంలో యర్రగొండపాలెంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రాం ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన గిరిజన నాయకులు, ప్రజల ముఖాముఖి కార్యక్రమంలో ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబుతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ గిరిపుత్రుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నట్లు తెలిపారు. గతంలో గిరిజనులకు ఎటువంటి ప్రాధాన్యత లేకుండా పోయిందని, జగనన్న సీఎంగా బాధ్యతలు చేపట్టిన మూడున్నర సంవత్సరాల కాలంలో అధిక ప్రాధాన్యత ఇస్తూ వచ్చారని వివరించారు. గతంలో ఏ ప్రభుత్వాలూ మంత్రి వర్గంలో గిరిజనులకు స్థానం కల్పించలేదన్నారు. ప్రస్తుతం ఏకంగా ఉప ముఖ్యమంత్రి పదవిని గిరిజనులకు కేటాయించి సముచిత స్థానం కల్పించిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందని మంత్రి అన్నారు. రాష్ట్రంలోని గిరిజనుల సమస్యలు తెలుసుకుని తక్షణమే పరిష్కరించే విధంగా ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేశారన్నారు. ఆ కమిషన్‌కు తగిన న్యాయం చేసేందుకు అన్ని విధాలుగా అర్హత, గిరిజనులపై మక్కువ ఉన్న కుంభా రవిబాబును మొదటి చైర్మన్‌గా నియమించడం జరిగిందన్నారు. సీఎం ప్రధాన ఉద్దేశాన్ని రవిబాబు ముందుకు తీసుకుని వెళ్తున్నారన్నారు. విద్యతోనే అన్ని సమస్యలకు పరిష్కారమని గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గిరిజనుల పిల్లలు చదువుల్లో ధనవంతుల పిల్లలతో పోటీ పడేవిధంగా చర్యలు తీసుకుంటున్నారని, ప్రపంచంలో 200 యూనివర్శిటీలను గుర్తించి పేద పిల్లలు ఆయా ప్రాంతాలకు వెళ్లి చదువుకునే అవకాశాన్ని సీఎం కల్పించారని తెలిపారు. అందుకు కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. వ్యవసాయం చేసుకునే గిరిపుత్రులు అభివృద్ధి చెందాలన్న ఉద్దేశంతో గతంలో వైఎస్సార్ ఆర్వోఎఫ్‌ఆర్ చట్టాన్ని దేశంలోనే తొలిసారిగా మన రాష్ట్రంలో అమలుచేసి గిరిజనులకు వ్యవసాయ భూములపై హక్కు కల్పించే విధంగా పట్టాలివ్వడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఆయన తనయుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగు అడుగులు ముందుకేసి గిరిజనులకు రైతు భరోసా వర్తించే విధంగా చర్యలు తీసుకున్నారని తెలిపారు. చెంచులు ఎక్కువగా నివశించే నియోజకవర్గంలో వారి అభివృద్ధి కోసం అనేక చర్యలు చేపట్టడం జరిగిందని, పెద్దదోర్నాలలో గిరిపుత్రుల కోసం రూ.25 కోట్లతో ఏకలవ్య పాఠశాల ఏర్పాటు చేశామని చెప్పారు. చెంచులకు నాణ్యమైన వైద్యం అందించేందుకు రూ.45 కోట్లతో పెద్దదోర్నాల మండలంలోని ఐనముక్కల గ్రామంలో సూపర్ స్పెషాలిటీ వైద్యశాల ఏర్పాటు చేస్తున్నామన్నారు. చెంచుగూడేల్లో రోడ్లు, తాగు, సాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు తనవంతు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనులను అభివృద్ధి చేయాలన్న ఆలోచనతో ముందుకు సాగుతుంటే.. క్షేత్రస్థాయిలో అధికారులు నీరుకారుస్తున్నారని అన్నారు. దీనివలన గిరిజనులు అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. ముఖ్యంగా రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, వారిపై ఎస్టీ కమిషన్ అధికారాన్ని వినియోగించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం పేద పిల్లల చదువులకు కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టి కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అన్ని వసతులు కల్పిస్తోందని, గిరిజనగూడేల్లో కూడా ఈ వసతులు కల్పించడం జరిగిందని ఆయన వివరించారు. ఆయా చెంచుగూడేల్లో చదువుకోవడానికి అవకాశం ఉన్నప్పటికీ ఆయా ప్రాంతాల్లో నివశించే పిల్లలకు అధికారులు పుట్టిన తేదీ సర్టిఫికెట్ ఇవ్వలేక పోతున్నారన్నారు. దీనివలన వారికి ఆధార్ కార్డు అందడం లేదన్నారు. ముందుగా స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ ప్రభుత్వంపై వీరోచితంగా పోరాడి ప్రాణ త్యాగం చేసిన గిరిజన సాయుధ పోరాట యోధులు హనుమంతప్ప, బయ్యన్న చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి ఆదిమూలపు సురేష్ ఎస్టీ కమిషన్ చైర్మన్ రవిబాబు, సభ్యులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమాధికారి జగన్నాథరావు, డీఎల్‌డీవో బి.వి.ఎస్.సాయికుమార్, తహసీల్దార్లు రవీంద్రరెడ్డి, కె.దాస్, ఎంపీడీవోలు ఎం.రంగసుబ్బారాయుడు, ఎస్.రాజ్యలక్ష్మి, ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్‌వో ఎం.శ్రీనివాసరావు, వివిధ తెగల గిరిజన నాయకులు శంకర్‌నాయక్, ఆర్.అరుణాబాయి, మురళీధర్, రామలక్ష్మి, వాగ్యానాయక్, ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు కె.ఓబుల్‌రెడ్డి, బి.వి.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఏపీఎంఐపీని పక్కాగా అమలు చేయాలి



అధికారులతో సమీక్షిస్తున్న ఏపీఎంఐపీ పీవో హరినాథ్‌రెడ్డి, కలెక్టర్ దినేష్‌కుమార్

- ప్రాజెక్ట్ అధికారి హరినాథ్‌రెడ్డి
- ప్రకాశం, నెల్లూరు జిల్లాల స్థాయిలో సమావేశం
- పాల్గొన్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఏపీఎంఐపీ పథకాన్ని పక్కాగా అమలు చేయాలని ఆ పథకం ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ సీబీ హరినాథ్‌రెడ్డి అధికారులను కోరారు. ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో పథకం అమలవుతున్న తీరుపై ఒంగోలులోని ప్రకాశం భవనంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌తో కలిసి నిర్వహించిన సమీక్షలో హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ మైక్రో ఇరిగేషన్ కంపెనీలు ప్రభుత్వ ఆదేశాల మేరకు సక్రమంగా పనిచేయాలన్నారు. సరిగా పనిచేయని కంపెనీలకు నోటీసులు జారీ చేస్తామన్నారు. మైక్రో ఇరిగేషన్ అవసరమైన రైతులకు సూక్ష్మ సేద్య పరికరాలు అందజేయాలన్నారు. ఉద్యానవనశాఖ పరిధిలో ఏపీఎంఐపీ పథకం అమలుపై వివరాలడిగి తెలుసుకున్నారు. ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని మార్చి నాటికి పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో అమలు చేస్తున్న ఏపీఎంఐపీ పథకం తీరును వివరించారు. డ్రిప్ ద్వారా ఎరువుల వాడకం, నీటి ఆదా, తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు సాధించేలా క్షేత్ర స్థాయిలో సిబ్బంది పనిచేయాలన్నారు. కౌలు రైతులకు సూక్ష్మ సేద్య పరికరాలు ఇచ్చేందుకు తగిన సూచనలు చేశారు. రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యాలయం నుంచి వచ్చిన డి.రమేష్, వై.వెంకటేశ్వర్లు, బి.రవీంద్రబాబు, బి.శ్రీనివాసులు, ఉద్యానవన అధికారి గోపీచంద్, హార్టీకల్చర్ అధికారి, ఏపీఎంఐపీ సిబ్బంది, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వీసీగా అంజిరెడ్డి



అంజిరెడ్డి

ఒంగోలు: ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వైస్ చాన్సిలర్‌గా అంజిరెడ్డి మారెడ్డిని నియమిస్తూ రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అంజిరెడ్డి ప్రస్తుతం హైదరాబాద్ జవహర్‌లాల్ నెహ్రూ టెక్నోలాజికల్ యూనివర్శిటీ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ టెక్నాలజీ, సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈయన స్వగ్రామం నాగులుప్పలపాడు మండలం బి.నిడమానూరు.

పేదల ఆర్థికాభివృద్ధే జగనన్న లక్ష్యం

పెద్దారవీడు: ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనేందుకు పెద్దారవీడు చేరుకున్న మంత్రికి వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు గజమాలతో ఘన స్వాగతం పలికారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లిన మంత్రి.. గడిచిన మూడున్నరేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మంత్రి మాట్లాడుతూ.. ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా, జీవన ప్రమాణాలు మెరుగయ్యేలా జగనన్న పరిపాలన సాగిస్తున్నారన్నారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. నవరత్నాలు సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి దాదాపు రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వరకు లబ్ధి చేకూరిందన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు ఇవ్వడంతో పాటు అవినీతికి తావు లేకుండా లబ్ధిదారులకు నగదు బదిలీ చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధ్యమనే ఉద్దేశంతో విద్యాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చి నిధులు కేటాయించిందన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థతో ప్రజల ముంగిటకే పాలన తీసుకువచ్చినట్లు తెలిపారు. అన్నదాతల కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ ఫలాలను క్రమం తప్పకుండా అందిస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. మేలు చేసిన ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు తెలిపిన సమస్యలను అధికారులతో నమోదు చేయించి వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. అంతర్గత రహదారులను సీసీ రోడ్లుగా మార్చాలని మహిళలు విజ్ఞప్తి చేయగా త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ దుగ్గెం చెన్నమ్మ, ఎంపీటీసీ గొట్టం రాజనారాయణమ్మ, జెడ్పీటీసీ ఏర్వ చలమారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ దూదేకుల కాశయ్య, నాయకులు అల్లు వెంకటేశ్వరరెడ్డి, కాసు వెంకటరెడ్డి, బత్తుల సాలయ్య, గొట్టం వేణుగోపాలరెడ్డి, అల్లు ఏడుకొండలు, స్కూల్ చైర్మన్ అల్లు గోవిందరెడ్డి, ఎంపీడీఓ రాజ్‌కుమార్, డీటీ శ్రీనివాసులు, ఏఈ రమేష్, డాక్టర్ వెంకటేశ్వర్లు, ఎంఈఓ శ్రీనివాసులు, ఏఓ బుజ్జిబాయి, ఏపీఓ సాంబశివుడు, ఏపీఎం శ్రీనివాసులు, వీఆర్వో శ్రీనివాసులు, ఏఎస్ గోవిందరెడ్డి, పార్టీ గ్రామ కన్వీనర్లు, వలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పెద్దారవీడులో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

క్లుప్తంగా

లైంగిక దాడి కేసులో నిందితుడి అరెస్టు

ముండ్లమూరు: మండలంలోని బొప్పూడివారిపాలెంలో బాలికపై లైంగిక దాడికి పాల్పడిన గోవిందయ్యను గురువారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ ఎల్.సంపత్‌కుమార్ తెలిపారు. ఈ నెల నాలుగో తేదీన బాలికపై గోవిందయ్య లైంగిక దాడికి పాల్పడగా బుధవారం కేసు నమోదైంది. ఈ కేసులో గోవిందయ్యను బొప్పూడివారిపాలెంలో అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యార్థిని ఆత్మహత్యపై విచారణ

ముండ్లమూరు: మండంలోని ఉమామహేశ్వరపురం గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థిని గూడాల కిరణ్మయి ఆత్మహత్యకు కారణాలపై దిశ డీఎస్పీ పల్లపురాజు విచారణ నిర్వహించారు. కేసు దర్యాప్తులో భాగంగా గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌కి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఉమామహేశ్వరపురం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన సమయంలో మొదట ఎవరు చూశారు, హాస్పిటల్‌కి ఎలా తరలించారు, ఏ ప్రాంతంలో చనిపోయింది అనే వివరాలు కుటుంబసభ్యులను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పూడ్చి పెట్టిన ప్రాంతాన్ని పరిశీలించారు. చనిపోయిన వెంటనే స్థానిక పోలీసులకు సకాలంలో సమాచారం ఇవ్వకపోవడానికి కారణాలను తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉన్నందున పూర్తి వివరాలను నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు అందజేస్తామని డీఎస్పీ తెలిపారు.

సెలవులో ఎస్పీ మలికా గర్గ్

- ఇన్‌చార్జిగా పల్నాడు ఎస్పీ రవిశంకర్

ఒంగోలు టౌన్: జిల్లా ఎస్పీ మలికా గర్గ్ వ్యక్తిగత పనుల నిమిత్తం ఈ నెల 10 నుంచి మూడు రోజుల పాటు సెలవులో వెళ్లారు. దీంతో జిల్లా ఇన్‌చార్జి ఎస్పీగా పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌కు గుంటూరు రేంజ్ ఐజీ సీఎం త్రివిక్రమ్‌వర్మ బాధ్యతలు అప్పగించారు.

హార్డ్‌వేర్ దుకాణంలో అగ్ని ప్రమాదం


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మార్కాపురం: పట్టణంలోని శివాలయం వీధిలో ఉండే ఒక హార్డ్‌వేర్ దుకాణంలో బుధవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. ఒక్కసారిగా అగ్నికీలలు ఎగిసిపడటంతో దుకాణంలోని పెయింట్ డబ్బాలు, హార్డ్‌వేర్ మెటీరియల్ కాలిబూడిదయ్యాయి. రాత్రి 11.30 గంటల సమయంలో మూడో అంతస్తు నుంచి పొగలు రావడాన్ని స్థానికులు గుర్తించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ ఆఫీసర్ వెంకట్రావు ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. జిల్లా అగ్నిమాపక అధికారి వేనుగోపాల్, మార్కాపురం డీఎస్పీ కిషోర్‌కుమార్, సీఐ భీమానాయక్ తదితరులు సంఘటనా స్థలానికి చేరుకుని చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేసి బయటకు రప్పించారు. ప్రమాదానికి కారణం విద్యుత్ షార్ట్ సర్క్యూటా లేదా అనేదానిపై స్పష్టత రాలేదని, దర్యాప్తులో తేలాల్సి ఉందని మార్కాపురం అగ్నిమాపక శాఖాధికారి పేర్కొన్నారు. దుకాణం యజమాని సుబ్రహ్మణ్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై శశికుమార్ తెలిపారు. పోలీసులు వివిధ కోణాల్లో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

అధికారుల్లో మార్పు రావాలి

- అమాయక గిరిజనులను మోసం చేయొద్దు
- వారి భూముల విషయంలో నిర్లక్ష్యం వద్దు
- అలా చేస్తే సహించేది లేదు
- ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు హెచ్చరిక
- గిరిజనుల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషికి సహకరించాలని పిలుపు


సంఘం తండాలో ప్రసంగిస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు

త్రిపురాంతకం: గిరిజనుల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేషంగా కృషి చేస్తున్నారని, అందుకు తగిన విధంగా అధికార యంత్రాంగంలో మార్పు రావాలని ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు హితవు పలికారు. గిరిజనులను అమాయకులను చేసి మోసం చేయాలనుకున్నా.. వారి భూముల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినా సహించేది లేదని తీవ్రంగా హెచ్చరించారు. త్రిపురాంతకం మండలం సంఘంతండాలో గిరిజనులతో గురువారం ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఈ మండలంలోని రెవెన్యూ అధికారులు ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. ఎస్టీ కమిషన్ వస్తే తహసీల్దార్ సెలవుపై వెళ్లడం చూస్తుంటే.. ఇక్కడ రెవెన్యూ అధికారులు గిరిజరులకు ఎంత విలువిస్తున్నారో అర్థమవుతోందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనులకు ప్రత్యేకంగా అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని తెలిపారు. గిరిజన యూనివర్సిటీ తెచ్చారని, విద్యకు ప్రాధాన్యత ఇచ్చి ప్రతి ఒక్కరూ చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. ఆదివాసులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నప్పటికీ.. అధికారులు మాత్రం పలకడం లేదన్నారు. అధికారులు స్పందించి ఉంటే ఇప్పటికే వారి జీవితాల్లో మార్పు కనిపించేదని అన్నారు.

భూముల్లో గిరిజనులు.. ఆన్‌లైన్‌లో మరొకరు..!

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా త్రిపురాంతకం మండలంలోని సంఘం తండా గిరిజనులకు చెందిన రెండు వేల ఎకరాల భూములు ఆన్‌లైన్‌లో వేరే వారి పేర్లపై నమోదు కావడం దారుణంగా ఉందని రవిబాబు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. గిరిజనులు సాగు చేస్తున్న భూములను ఆన్‌లైన్‌లో మరొకరి పేరుపై ఏ విధంగా నమోదు చేశారని ఆయన ప్రశ్నించారు. ఐదు సంవత్సరాలుగా గిరిజనులు సాగుచేసే భూములు రాజ్యాంగం ప్రకారం వారికే చెందుతాయన్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. దీనిపై కోట్లాది రూపాయలు చేతులు మారినట్లు ఆరోపణలు ఉన్నాయని విమర్శించారు. అమాయక గిరిజనులు ఏం చేస్తారులే అనుకుంటే పొరపాటేనని, ప్రభుత్వం గిరిజనుల పక్షాన పనిచేస్తోందని స్పష్టం చేశారు. ఎస్టీ కమిషన్ నుంచి మొదటిసారిగా నోటీస్ అందుకుంటున్నది ప్రకాశం జిల్లా రెవెన్యూ శాఖ అని రవిబాబు పేర్కొన్నారు. గిరిజన భూముల సమస్యలపై ఫారెస్ట్ అధికారులు స్పందించాలన్నారు. స్థానిక గిరిజనులు ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు, పెన్షన్లు, విద్యుత్, రోడ్లు, రవాణా సౌకర్యాలు సక్రమంగా లేవని ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకురాగా, అధికారులతో మాట్లాడిన రవిబాబు.. రెండు నెలల్లో పరిష్కరించాలని సూచించారు. హాజరుకాని అధికారులకు షోకాజ్ నోటీసులు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ సభ్యులు శంకర్‌నాయక్, రామలక్ష్మి, మురళి, లిల్లీ, డీఎల్‌డీవో సాయికుమార్, పంచాయతీరాజ్ డీఈ సుబ్బారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రామకృష్ణ, ఎంఈవో కె.తులసిమల్లికార్జున నాయక్, డిప్యూటీ తహసీల్దార్ భ్రమరాంబ, ఎంపీడీవో మరియదాస్, ఈవోఆర్డీ మురళీమోహన్, సీఐ ఎం.రాంబాబు, ఎస్సై జీవీ సైదులు, త్రిపురాంతకం, సంఘం తండా సర్పంచ్‌లు పొన్న వెంకటలక్ష్మి, హనిమీభాయి, జెడ్పీటీసీ మాకం జాన్‌పాల్, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఆర్.సుశీల వెంకట పిచ్చయ్య, స్థానిక ఎస్టీ నాయకులు బాలూనాయక్, బాలాజీనాయక్, సుక్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య

మద్దిపాడు: వివాహమైన ఏడాదికే భార్య విడాకులు కోరడం, ఆ మేరకు కోర్టు విడాకులు మంజూరు చేయడం తదితర పరిణామాలతో మనస్తాపం చెందిన ఓ యువకుడు చెరువులో పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మద్దిపాడు మండలంలోని ఏడుగుండ్లపాడు సర్వీస్ రోడ్డు పక్కన గురువారం వెలుగుచూసింది. అందిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం మొలకలూరు గ్రామానికి చెందిన తుపాకుల నాగభూషణం(32) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. గుంటూరుకు చెందిన మల్లిక అనే యువతితో 2021లో వివాహమైంది. ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో పరస్పర అంగీకారంలో విడాకుల కోసం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ క్రమంలో మనస్తాపం చెందిన నాగభూషణం ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి బయలుదేరి జరుగుమల్లి మండలం నర్సింగోలుకు వెళ్లాడు. బుధవారం మధ్యాహ్నం సమయంలో తిరుగుప్రయాణంలో ఏడుగుండ్లపాడు చెరువులో దూకి మరణించాడు. కుమారుడు ఇంటి వద్ద కనిపించకపోవడంతో తండ్రి వెంకటేశ్వర్లు తనను వెతుక్కుంటూ నర్సింగోలు వెళ్లాడు. కుమారుని జాడ అన్వేషిస్తూ ఏడుగుండ్లపాడు వచ్చే సరికి చెరువు పక్కనే నిలిపి ఉంచిన స్కూటీని గుర్తించాడు. అనుమానంతో టార్చిలైట్లు వేసి చెరువులో వెతుకుతుండగా నాగభూషణం మృతదేహం కనిపించింది. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో మద్దిపాడు ఎస్సై శ్రీరామ్‌కు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై యువకుడి మృతదేహాన్ని బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీరామ్ తెలిపారు.


యువకుడి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శ్రీరామ్

పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి

ఒంగోలు: ఈ నెల 15, 17 తేదీల్లో ఎథిక్స్, పర్యావరణ విద్య పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించాలని ఇంటర్మీడియెట్ ఆర్ఐఓ వీవీ సుబ్బారావు అన్నారు. స్థానిక ఏకేవీకే కాలేజీలో ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణపై కాలేజీల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా యూనిట్‌గా నిర్వహించే ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎథిక్స్, పర్యావరణ విద్య పరీక్షలకు 28162 మంది ప్రథమ సంవత్సరం విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. సైన్స్ ప్రాక్టికల్స్ పరీక్షలకు ఈ నెల 20 నుంచి, ఒకేషనల్ ప్రాక్టికల్స్ ఈ నెల 26 నుంచి నిర్వహిస్తామని తెలిపారు. ఈ పరీక్షల నిర్వహణపై శిక్షణ ఇచ్చామని, 26,043 మంది హాజరవుతారన్నారు. శిక్షణలో జిల్లాలోని సీనియర్ ప్రిన్సిపాల్ పి.రమణారెడ్డి, , స్వరూపారాణి, సత్యన్నారాయణలు ప్రిన్సిపాళ్లకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బాపట్ల, ప్రకాశం జిల్లాల వృత్తి విద్యాశాఖ అధికారులు ఆంజనేయులు, ఎస్‌వీ సుబ్బారావు హాజరు కాగా కార్యక్రమాన్ని ఇంటర్మీడియెట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి సైమన్ విక్టర్ పర్యవేక్షించారు.

వాటర్‌గ్రిడ్‌తో 442 గ్రామాలకు సురక్షిత జలాలు

- ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్
- పైప్‌లైన్ సర్వే మ్యాప్ పరిశీలన


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా

కనిగిరి రూరల్: ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్‌యాదవ్ కృషి ఫలించింది. కనిగిరి ప్రాంతంలో పెరుగుతున్న కిడ్నీ, ఫ్లోరైడ్ బాధితల వ్యథను సీఎం వైఎస్ జగన్‌కు పలుమార్లు ఎమ్మెల్యే నివేదించడంతో ప్రభుత్వం చేపట్టిన జలజీవన్ మిషన్ (జేజేఎం) వాటర్ గ్రిడ్ స్కీంలో జిల్లాలోని పశ్చిమ ప్రకాశంకు స్థానం కల్పించారు. అందులో భాగంగా కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని 442 గ్రామాల్లో వెలిగొండ సాగర్ జలాలు అందించేందుకు రూ.400 కోట్లతో సురక్షిత జలాల ప్రాజెక్టును మంజూరు చేశారు. ఈ మేరకు జనవరిలో టెండర్లు పూర్తి కాగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పైప్‌లైన్ సర్వే ప్రారంభించారు. ఈ క్రమంలో వెలిగొండ గొట్టిపడియ గ్యాప్ నుంచి కనిగిరికి నేరుగా పైప్ లైన్ ద్వారా సాగర్ జలాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. గురువారం రాత్రి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, కంపెనీ ప్రతినిధులు ఎమ్మెల్యేతో సమావేశమై ప్రాజెక్టు పైప్‌లైన్ సర్వే, నిర్మాణ వివరాలు వెల్లడించారు.

పైప్‌లైన్ సర్వే ఇలా..

జిల్లాలోని పశ్చిమ ప్రకాశంలో గిద్దలూరు, వైపాలెం, మార్కాపురం, కనిగిరి ప్రాంతాలకు జేజేఎం (వాటర్ గ్రిడ్ స్కీం)తో రూ.1,290 కోట్లతో 1067 గ్రామాలకు ప్రాజెక్టు టెండర్లు పూర్తి కాగా అందులో కనిగిరి ప్రాంతంలోని ఆరు మండలాలకు రూ.400 కోట్లతో 442 గ్రామాలకు వెలిగొండ సురక్షిత జలాలు ఇవ్వనున్నారు. ఈ మేరకు వెలిగొండ గొట్టిపడియ (కొండపై) నీటి శుద్ధి ట్యాంక్ ఏర్పాటు చేసి అక్కడి నుంచి పైప్‌లైన్ ద్వారా కనిగిరి ఆరు మండలాలకు నీరు పంపింగ్ చేస్తారు. దానికి సంబంధించి ప్రధాన పంపింగ్ కేంద్రం(ట్యాంక్) కనిగిరి నందనమారెళ్ల కొండపై నిర్మిస్తారు. అక్కడి నుంచి రెండు పైప్‌లైన్ మార్గాల ద్వారా నియోజకవర్గంలోని అన్ని మండలాలకు నీళ్ల సరఫరా వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. పునుగోడు సంప్ నుంచి పీసీపల్లి, కనిగిరిలో కొంత భాగం, చాకిరాల సంప్ నుంచి కనిగిరిలో కొంతభాగం, వెలిగండ్ల, పీసీపల్లి, సీఎస్‌పురం, పామూరు ఏరియాలకు, పామూరు సంప్ నుంచి పీసీపల్లిలోని కొంత భాగం ఏరియాలకు, కొనకనమిట్ల సంపు నుంచి హెచ్‌ఎంపాడు మండలానికి సురక్షిత జలాలు పంపింగ్ చేసి ప్రతి గ్రామానికి పైప్‌లైన్ వెళ్లేలా మ్యాప్ రూపొందించినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ప్రతాప్‌రెడ్డి వివరించారు.

ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తి చేయండి

సుమారు 30 ఏళ్ల ముందస్తు జనాభాకనుగుణంగా నిర్మించే ఈ సురక్షిత నీటి జలాల ప్రాజెక్టును పక్కా ప్రణాళికతో, నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ తెలిపారు. కనిగిరి ప్రాంత ప్రజలకు ఫ్లోరైడ్ నుంచి విముక్తి కల్పించేందుకు సాధ్యమైనంత త్వరగా ప్రాజెక్టు నిర్మించాలని కంపెనీ ప్రతినిధులను, అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి నీరు సురక్షిత నీరు సరఫరా అయ్యేలా పైప్‌లైన్ సర్వే మ్యాప్ ఉండాలని అధికారులను సూచించారు. కార్యక్రమంలో ఏఈ రమేష్, కంపెనీ ప్రతినిధులు బాలకృష్ణ, భీముడు, వాసవీ సత్రసముదాయ రాష్ట్ర అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

అంతర్ రాష్ట్ర దొంగ అరెస్ట్


దొంగతనం కేసు వివరాలు వెల్లడిస్తున్న ఇంకొల్లు ఎస్సై నాయబ్ రసూల్

ఇంకొల్లు (చినగంజాం): ఇంకొల్లు మండలంలో పలు దొంగతనాలకు పాల్పడిన వ్యక్తిని ఇంకొల్లు పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఇంకొల్లు ఎస్సై ఎస్‌కే నాయబ్ రసూల్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇంకొల్లు మండలం కొణికి, పావులూరు గ్రామాల్లోని గృహాల్లో దొంగతనానికి పాల్పడిన ప్రకాశం జిల్లా సంతనూతలపాడు మండలం పేర్నమిట్టకు చెందిన తన్నీరు మధుబాబును గురువారం పోలీసులు అరెస్టు చేశారు. 2022 సంవత్సరంలో కొణికి గ్రామంలోని రెండు నివాస గృహాలతో పాటు పావులూరు గ్రామంలోని ఒక ఇంట్లో దొంగతనం చేసి బంగారం, నగదును మధుబాబు దొంగిలించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. గురువారం అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. దొంగతనానికి పాల్పడినట్లు అంగీకరించడంతో అతని వద్ద నుంచి సుమారు 15 గ్రాముల బరువు గల 5 జతల బంగారు చెవి దుద్దులు, సుమారు 8 గ్రాముల బరువు గల 4 బంగారు ఉంగరాలు, సుమారు 30 గ్రాముల బరువు గల ఒక జత వెండి కాలి పట్టీలు, రూ.5 వేల నగదు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అతని వద్ద నుంచి మొత్తం 23 గ్రాముల బంగారు ఆభరణాలు, 30 గ్రాముల వెండి పట్టీలు, రూ.5 వేల నగదు కలిపి సుమారు రూ.1.25 లక్షల విలువైన వాటిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు అంచనా వేశారు. కేసు రికవరీలో ప్రతిభ చూపిన ఎస్సై ఎస్‌కే నాయబ్ రసూల్, అతని సిబ్బందిని బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు.